క్లుప్తంగా

దత్తత విద్యార్థులకు స్టేషనరీ అందజేత



విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాస్

పెదగంట్యాడ: విద్యార్థులను దత్తత తీసుకోవడంతో పాటు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ వారికి అవసరమైన స్టేషనరీని అందజేయడం అభినందనీయమని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో నడుపూరు జిల్లా పరిషత్ పాఠశాలలో దత్తత తీసుకున్న విద్యార్థులకు స్టేషనరీని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ అధినేత చాంద్ బాషాను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాషిణి, అరుణకుమారి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి మోదీ సంక్షేమ పథకాలు



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గాజువాక: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు అన్నారు. బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమం ముగింపు సందర్భంగా గాజువాక హైస్కూల్ రోడ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా 18 రకాల చేతి వృత్తుల కళాకారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు కాశీ విశ్వనాథం, నాగరాజు, స్వర్ణలత, కర్రి రమణ, విఠల్ పటేల్, లక్ష్మణరావు, గీత తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ లైట్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



సిగ్నల్ లైట్ల స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

అగనంపూడి: జాతీయ రహదారి అగనంపూడి కూడలి వద్ద లారీ సిగ్నల్ లైట్ల స్తంభాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు. వివరాలివి.. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అగనంపూడి మరిడిమాంబ కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద అనకాపల్లి వైపు నుంచి వస్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌పైకి ఎక్కి, అక్కడి సిగ్నల్ లైట్ల స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం అడ్డుకోవడంతో లారీ ఆగిపోయింది. దీంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో జంక్షన్ వద్ద నిలిచిన వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉక్కు ఉద్యోగులకు వేతనాల చెల్లింపులో జాప్యంపై ఆగ్రహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సెప్టెంబర్ నెలాఖరుకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ మిత్రపక్షాల నాయకులు అన్నారు. ప్రతీ నెలా 30, 31 తేదీల్లో జీతాలు చెల్లించేవారన్నారు. శనివారం జీతాలు చెల్లించాలని యాజమాన్యానికి తెలిసినా బ్యాంకులకు వడ్డీ చెల్లించకపోతే డిఫాల్టర్ అవుతామని, జీఎస్టీ చెల్లించకపోతే స్టీల్‌ప్లాంట్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుందని చెప్పడం సరికాదన్నారు. యాజమాన్యం చర్యకు నిరసనగా అక్టోబర్ 2న యాజమాన్యం నిర్వహించే గాంధీ జయంతిని గుర్తింపు యూనియన్ బహిష్కరించి, వేరుగా నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబర్ 3న ఉదయం 8 గంటల నుంచి అడ్మిన్ బిల్డింగ్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రతీ పేదవాడి వైద్యానికి భరోసా

- ఆ దిశగా రూపొందించిన కార్యక్రమమే 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- సీడీఎంఏ కోటేశ్వరరావు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- గాజువాక పీహెచ్‌సీలో సురక్ష శిబిరం ప్రారంభం



జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీడీఎంఏ కోటేశ్వరరావు, ఎమ్మెల్యే నాగిరెడ్డి



రోగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు

గాజువాక: ప్రతీ పేదవాడికి మెరుగైన వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) పి.కోటేశ్వరరావు తెలిపారు. వైద్యుల సలహాలను పాటించి, ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. 'ఫ్యామిలీ డాక్టర్' ద్వారా సచివాలయాల పరిధిలో రోగుల ఇళ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటోందని, వారి వ్యాధులను గుర్తించి తగిన వైద్యం అందిస్తోందని అన్నారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలకు పేదలకు ఉచిత వైద్యం అందుతుందని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు కూడా అందుబాటులో ఉంటారన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇంటి చెంతనే వైద్యం అందించాలనే బృహత్తర లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఎంతో ఖరీదైన వైద్యాన్ని ఈ శిబిరాలలో నిపుణులైన వైద్యులతో ఉచితంగా జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్నారని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీవీఎంసీ కమిషనర్ సి.ఎం. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ అక్టోబర్ 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ పరిధిలోని 72 ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలలో రోగులకు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కంటి వైద్య పరీక్షలు, దంత వైద్య పరీక్షలు కూడా చేసి, మందులు అందిస్తారన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎ.జె.స్టాలిన్, రాజాన రామారావు, ఉరుకూటి చందు, బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, డీపీవో చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఇల్లపు ప్రసాద్, ధర్మాల శ్రీనివాసరావు, పల్లా చినతల్లి, కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, బోగాది సన్యాసిరావు, ఎస్ఎండీ గౌస్, సిరట్ల శ్రీనివాస్, యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది



రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద రోగుల రద్దీ

ఇంటికొచ్చి ఆరోగ్యం గురించి అడిగారు



వైద్య సిబ్బంది మా ఇంటికొచ్చి నా ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. షుగర్‌తో పాటు, కాళ్ల వాపులు, ఇతర సమస్యలు కూడా ఉండడంతో వారికి చెప్పాను. ఈ రోజు ఇక్కడికి రమ్మన్నారు. ఇక్కడ నాకు షుగర్ టెస్టు, మూత్ర పరీక్షలు చేశారు. ఈ టెస్టులన్నీ ఉచితంగా చేశారు.

– పార్వతి, అఫీషియల్ కాలనీ

క్షణాల్లో కళ్లజోడు ఇచ్చారు



నాకు చత్వారం ఉంది. మొన్న ఇంటికొచ్చిన సిబ్బందితో చెప్పడంతో పీహెచ్‌సీకి రమ్మన్నారు. ఈరోజు కళ్ల పరీక్షలు చేసి వెంటనే కళ్లజోడు ఇచ్చారు. ఇంకో కళ్లజోడు కూడా త్వరలోనే ఇస్తామన్నారు. వలంటీర్ ద్వారా దాన్ని మా ఇంటికే పంపిస్తామన్నారు. సేవలు చాలా బాగున్నాయి.

– నారాయణరాజు, శ్రీరామ్‌నగర్

అన్ని టెస్టులు చేసి, మందులిచ్చారు



రెండు మూడు రోజుల నుంచి ఒంట్లో బాగోలేదు. ఒళ్లు నొప్పులు, జలుబుతో ఇబ్బంది పడుతున్నాను. చర్మ సమస్య కూడా ఉంది. వీటన్నింటికీ పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా ఇచ్చారు. కంటి పరీక్షలు కూడా చేయించుకున్నాను. వైద్యులు బాగా చూశారు.

– నిర్మలా జ్యోతి, సుందరయ్య కాలనీ

ఇంద్రజాల ప్రదర్శనతో స్వచ్ఛతపై అవగాహన



హైస్కూల్‌లో ఇంద్రజాల ప్రదర్శన చేస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఇంద్రజాల ప్రదర్శన ద్వారా నిర్వహించారు. గెయిల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో గెయిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ స్టీఫెన్ పట్టా మాట్లాడారు. మన పరిసరాలను, మన ఊరిని, తద్వారా దేశాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మనం చేయాల్సిన పనులు, చేయకూడని పనులను ఇంద్రజాల ప్రదర్శన ద్వారా విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు విధిగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో గెయిల్ ఇండియా లిమిటెడ్ చీఫ్ మేనేజర్ మాధవ్ కుమార్, అధికారులు అశోక్ రెడ్డి, గున్న లక్ష్మి, ఉపాధ్యాయులు కుమారస్వామి, దేముళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపాటి జాగ్రత్తలతో విద్యుత్ ఆదా



ప్రతిజ్ఞ చేయిస్తున్న విద్యుత్ అధికారులు

గాజువాక : చిన్నపాటి జాగ్రత్తలను పాటించడం వల్ల విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవచ్చని ఏపీ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఓ.సింహాద్రి అన్నారు. విద్యుత్ ఆదాపై గాజువాక విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉపకరణాలను అవసరం ఉన్నప్పుడే ఉపయోగించాలని, మిగిలిన సమయాల్లో నిలిపివేయడం ద్వారా కొంత ఆదా చేయవచ్చన్నారు. విద్యుత్ ఉపకరణాలను కొనుగోలు చేసే సమయంలో స్టార్ రేటింగ్ చూసి, తక్కువ విద్యుత్‌ను ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేసుకోవడం వల్ల వినియోగం తగ్గుతుందన్నారు. విద్యుత్ ఆదా చేస్తామని వినియోగదారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు, ఏడీఈలు మీనకేతనరావు, పార్థసారధి, ఏఈలు శ్రీనివాసరావు, భీమరాజు, రామకృష్ణ, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వీడ్కోలు



కేశవరావు దంపతులను సత్కరిస్తున్న సీజీఎం కృష్ణకుమార్, జీఎం శ్రీనివాస్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయా విభాగాల్లో అధికారులు, సహోద్యోగులు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఆలమూరు కేశవరావు పదవీ విరమణ కార్యక్రమంలో ఫైనాన్స్ సీజీఎం వి.శాంతకుమార్ పాల్గొని, కేశవరావు దంపతులను సత్కరించారు. శాంతకుమార్ మాట్లాడుతూ కేశవరావు తన సర్వీసులో అధికారులు, సహోద్యోగుల మన్ననలు పొందటంతో పాటు విస్కా కార్యదర్శిగా కళలకు ఎనలేని ప్రోత్సాహం కల్పించారన్నారు. కార్యక్రమంలో జీఎం వి.శ్రీనివాస్, అధికారులు ఎల్.ఆర్.కె.ఎస్.వి. శాస్త్రి, పి.ఆర్.జి.ఎల్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- స్టీల్‌ప్లాంట్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లో జరిగిన కార్యక్రమంలో పదవీ విరమణ చేస్తున్న జనరల్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ములకలపల్లి అవినాష్‌ను పలువురు సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో సీనియర్ ట్రైనీగా చేరి అంచెలంచెలుగా మేనేజర్ స్థాయికి ఎదిగారన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధా నకార్యదర్శిగా ఎన్నికై అన్ని వర్గాల హక్కుల కోసం విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు వై.మస్తానప్ప, ఎం.పరదేశి, గంధం వెంకటరావు, డి.సంపూర్ణం, పిట్టా రెడ్డి, దరిగి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమంగా ఉక్కు పోరాటం



బహిరంగ సభ గోడపత్రిక ఆవిష్కరిస్తున్న స్టీల్ సిటూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి కోరారు. అందులో భాగంగా అక్టోబర్ 5న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎల్ఎంఎం పార్కులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారన్నీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు ఉధృతమైతే పాలకుల నిర్ణయాలపై ప్రభావం చూపుతాయన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రప్రభుత్వం అష్ట దిగ్బంధనం చేసినట్లుగా దాడి చేస్తోందన్నారు. దీన్ని ఎదుర్కోవడం కార్మికవర్గం ఒక్కరి వల్లే సాధ్యం కాదన్నారు. దీనికి ప్రజా మద్దతు కూడా తోడైతేనే దాడిని తిప్పి కొట్టగలమన్నారు. ఇందులో భాగంగా ప్రజా మద్దతును కోరడానికి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సభకు హాజరవుతున్నారన్నారు. స్టీల్ సిటూ అధ్యక్షుడు వై.టి. దాస్ ప్రసంగించిన కార్యక్రమంలో నాయకులు ఎస్. రామారావు, శ్రీనివాసరాజు, గంగాధర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ గణపతి సన్నిధిలో అలరించిన నృత్యప్రదర్శన



కళాకారిణులను అభినందిస్తున్న ప్రముఖులు

అక్కిరెడ్డిపాలెం: గ్లోబెక్స్ వద్ద సీఎంఆర్ స్థలంలో కొలువైయున్న 112 అడుగుల ఆయుష్ గణపతి వద్ద నృత్యనికేతన్ డాన్స్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థులను పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు, అధికారులు అభినందించి జ్ఞాపికలను అందజేశారు.

గంగ ఒడికి గణనాథుడు

వైభవంగా నిమజ్జనోత్సవాలు



ప్రత్యేక ఆకర్షణగా కాంతారా వేషధారణలు



భారీ గణపతిని పురవీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం



కోలాటంతో సందడి చేస్తున్న మహిళలు, చిన్నారులు



యారాడ తీరంలో క్రేన్ సాయంతో నిమజ్జనం

పెదగంట్యాడ: గణపతి అనుపు ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 18న కొలువుదీరిన గణనాథునికి 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు జరిపారు. నడుపూరులో శ్రీకృష్ణ దేవరాయ యూత్ ఆధ్వర్యంలో, కోరాడలో వినాయక యూత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహించారు. సీతానగరంలో రాధాకృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద నెలకొల్పిన గణనాథుని అనుపు ఉత్సవం కోలాహలంగా సాగింది. డీజేలు, కోలాటాలు, నేలవేషాలు, మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో సందడిగా సాగింది. యారాడ, అప్పికొండ తీరాల్లో బొజ్జ గణపతిని నిమజ్జనం చేశారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదానంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

అగనంపూడి: రక్తదానం ఆవశ్యకతపై అందరికీ అవగాహన కల్పించాలని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఫ్రెండ్స్ బ్లడ్ డొనేషన్ అసోసియేషన్ సహకారంతో ఛత్రపతి శివాజీ వలంటరీ బ్లడ్ బ్యాంక్‌కు వంద యూనిట్లు రక్తాన్ని దానం చేశారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల మన శక్తిని, రక్తాన్ని కోల్పోమని.. కొత్త శక్తిని కలిగి ఉంటామని తెలిపారు. అపోహలు తొలగించుకోవాలని కోరారు. కళాశాల సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె. సుధాకర్, ఎన్ఎస్ఎస్ పీవో సుందర్ రామన్ పాల్గొన్నారు.

వాడవాడలా అన్న సమారాధనలు



ధర్మాల వీధిలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



లేమర్తిలో అన్న సమారాధన ప్రారంభిస్తున్న ఇల్లపు ప్రసాద్

కూర్మన్నపాలెం: వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వాడవాడలా అన్న సమారాధనలు నిర్వహించారు. 87వ వార్డు కణితి గవర వీధి, అప్పికొండ శెట్టిబలిజవీధి, కణితి ఉడపల వీధి, వడ్లపూడి తారకరామనగర్‌లలో ఏర్పాటు చేసిన నారాయణ సేవను ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లేమర్తిలో..

అగనంపూడి: 85వ వార్డు ఫార్మాసిటీ కాలనీ లేమర్తిలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనను వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ ఇల్లపు ప్రసాద్ ప్రారంభించారు. తరువాత అనుపు కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ధర్మాల వీధిలో ..

పెదగంట్యాడ: పెంటమాంబ యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా నెల్లిముక్కు ధర్మాల వీధిలో శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వంశీరెడ్డి, సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం




అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్, తలారివానిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్.గణపతిరావులను అగనంపూడి ప్రజా సంఘాలు ఘనంగా సత్కరించాయి. ప్రజా సంఘాల నాయకులు గుర్రం శ్రీను, నెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అగనంపూడి ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ బోధన సాగుతుందన్నారు. నాలుగేళ్లలో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లా స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కొలిపాక అప్పారావు, కిడిమి హనుమతురావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమం

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఉత్పత్తిపరంగా ఆటంకాలు సృష్టిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు దుర్మార్గమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రభుత్వ పరిపాలనను మునుపెన్నడూ చూడలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 961వ రోజు, శనివారం సంస్థకు చెందిన సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం దిగి వచ్చేవరకు నిరంతరాయంగా పోరాటం చేస్తునే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ మాసోత్సవాల ముగింపు



విజేతలతో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో నెల రోజుల పాటు నిర్వహించిన హిందీ మాసోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలకు స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ముఖ్య అతిథిగా హాజరై మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు రాజభాషా కీర్తి పురస్కారాల్లో వరుసగా ఆరోసారి మొదటి బహుమతి రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే, హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ, రాజభాష విభాగం జీఎం లలన్‌కుమార్, ఏజీఎం డాక్టర్ టి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సింబెక్స్–23 వేడుకలు



సింబెక్స్2023 పోస్టర్‌ను చూపుతున్న కమాండింగ్ ఆఫీసర్లు

సింధియా: సింగపూర్ ఇండియా మారిటైమ్ ద్వైపాక్షిక విన్యాసాలు సెప్టెంబర్ 28తో ముగిశాయి. భారత నౌకాదళ నౌకలు రణ్‌విజయ్, కవరత్తి, అలాగే జలాంతర్గామి, ఐఎన్ఎస్ సింధుకేసరిలు మారిటైమ్ ద్వైపాక్షిక విన్యాసాల్లో పాల్గొనేందుకు సింగపూర్ వెళ్లిన సంగతి తెలిసిందే. సింగపూర్‌లో భారత హైకమిషనర్ అధికారులు, భారత నావికాదళ కమాండింగ్ అధికారు లు, సింగపూర్ నేవీ ఫ్లీట్ కమాండర్లు, కారంజీ వార్ మెమోరియల్ వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

శ్రీవారికి పుష్పార్చన



అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో స్వామివారికి శనివారం రాత్రి విశేష పుష్పార్చన నిర్వహించారు. వేకువజాము నుంచి అర్చకులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.